మార్కెట్ ఆధునికీకరణ ఎప్పుడో?

- దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ఎంవీపీ చేపల బజార్
- కార్యరూపం దాల్చని జీవీఎంసీ ప్రణాళికలు

ఎంవీపీ కాలనీ: స్థానిక చేపల మార్కెట్ సౌకర్యాలేమితో కొట్టుమిట్టాడుతోంది. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని మార్కెట్ ఎంవీపీ కాలనీవాసులకు దిక్కవుతోంది. దాదాపు 30 ఏళ్ల నుంచి 32 షాపుల ద్వారా ఇక్కడ చేపలు, మాంసాహార ఉత్పత్తుల విక్రయాలు జరుగుతున్నాయి. వారాంతాల్లో ఈ బజార్ వినియోగదారులతో రద్దీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో కొన్నేళ్లుగా ఈ బజార్‌ను పూర్తిస్థాయిలో ఆధునికీకరించాలని స్థానికులు, వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నా జీవీఎంసీ యంత్రాంగం పట్టనట్టు వ్యవహరిస్తోంది. స్థానికుల ప్రతిపాదలనలతో ఆధునికీకరణకు ప్రణాళికలు సిద్ధం చేశామని జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం గతంలోనే ప్రకటించినా నేటికి అది కార్యరూపం దాల్చలేదు.


ఇరుకుమయంగా ఎంవీపీ చేపల మార్కెట్

అద్దెల రూపంలో జీవీఎంసీకి ఆదాయం
మాంసాహార ఉత్పత్తుల అమ్మకాల కోసం దాదాపు 30 ఏళ్ల క్రితమే ఈ మార్కెట్ అందుబాటులోకి వచ్చినట్టు వ్యాపారులు చెబుతున్నారు. అంతకు ముందు ఎంవీపీ కూడలి చుట్టూ రోడ్డును ఆనుకొని మత్స్యకారులు అమ్మకాలు చేసేవారు. అనంతరం అక్కడి వ్యాపారుల కోసం ఈ మార్కెట్‌ను అందుబాటులోకి తెచ్చారు. అప్పటి నుంచి జీవీఎంసీ ఈ మార్కెట్‌పై ఆశీలు రూపంలో వచ్చే ఆదాయాన్ని భారీగా పొందుతున్నా ఆధునికీకరణను మాత్రం గాలికి వదిలేసింది. రెండేళ్ల క్రితం ఈ మార్కెట్‌లో షాపులకు మరోసారి వేలం నిర్వహించి భారీగా అద్దెలు సైతం పెంచారు.


అధ్వానంగా ఉన్న మార్కెట్‌లోని కాలువ

మార్కెట్‌ను పట్టించుకోవడంలేదు..

దశాబ్దాలుగా ఎంవీపీ నాన్‌వెజ్ ఉత్పత్తుల మార్కెట్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. జీవీఎంసీ కాలనీని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నప్పటికీ ప్రజల అవసరాలతో ముడిపడి ఉన్న చేపల బజార్‌ను పట్టించుకోవడం లేదు. 30 ఏళ్ల క్రితం జీవీఎంసీ అప్పటి అవసరాలకు అనుగుణంగా మార్కెట్‌ను అభివృద్ధి చేసింది. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఆధునికీకరించ లేదు. ఇరుకు మార్కెట్‌లోకి వెళ్లి ఇబ్బందులు పడుతున్నాం.

– ఎల్లాజీరావు, ఎంవీపీ కాలనీ

క్షీణించిన పారిశుధ్యం

మార్కెట్‌లో పారిశుధ్యం క్షీణించింది. రద్దీ కారణంగా కనీసం వినియోగదారులు నిలిచేందుకు చోటు లేని పరిస్థితి. దీంతో ఇరుకు మార్గంలోనే చేపలు ఉత్పత్తులు, చికెన్, మటన్ విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో పాటు మార్కెట్‌లో కుళ్లిన వ్యర్థాల కారణంగా దుర్గంధం వెదజల్లుతోంది. కాలువలు అధ్వానంగా ఉన్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ పూర్తి స్థాయిలో మార్కెట్‌ను ఆధునికీకరించాలని కోరుతున్నాం.

– శ్రీను, ఎంవీపీ కాలనీ

రామకృష్ణాపురంలో 'బడి పిలుస్తోంది'

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో గురువారం 'బడి పిలుస్తోంది'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించండి అంటూ కార్పొరేటర్ కెల్ల సునీత గ్రామస్తులను కోరారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది, పాఠశాల కమిటీ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఆమె ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. బడి పిలుస్తోంది అంటూ ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. బడిఈడు పిల్లలున్న తల్లిదండ్రులతో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలిస్తున్న సౌకర్యాలు గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ ఫీజు ఉండదని, ఇంగ్లిష్ మీడియంలో బోధన చేస్తారని, యూనిఫారం, బ్యాగు, షూలు, పాఠ్య పుస్తకాలు ఉచితంగా అందిస్తున్నారని ఆమె తెలిపారు. పిల్లలకు మధ్యాహ్న భోజనం సౌకర్యం కల్పించి అమ్మఒడి రూపంలో తల్లుల బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ చేస్తారన్నారు. విశాలమైన తరగతి గదులు, మరుగుదొడ్లు, ఆట స్థలాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమ్మరాజు, గ్రామ అధ్యక్షుడు వంకర బాబూరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, కాకర గోవింద్, గడ్డంనాయుడు, వీరబాబు, వెంకటేశ్వరరావు, సింహాచలం, నాగరాజు పాల్గొన్నారు.


పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరుతున్న కార్పొరేటర్ సునీత

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఆరిలోవ ప్రాంతంలో పలు చోట్ల శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. 33/11 కేవీ ఆరిలోవ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ హనుమంతవాక ఫీడర్‌లో మరమ్మతులు జరగనున్నాయి. దీంతో చినగదిలి, పెదగదిలి పరిసర ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు
విమ్స్ పరిధి 33/11 కేవీలో 11 కేవీ ఇందిరానగర్ ఫీడర్‌లో శనివారం మరమ్మతులు జరగనున్నాయి. దీంతో ఇందిరానగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్, రవీంద్రనగర్, బీఎస్ఆర్ నగర్, తోటగరువు, హనుమంతవాక కొండ పరిసరాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉండదని జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా

రిజిస్ట్రార్‌తో మర్యాద పూర్వక భేటీ


రిజిస్ట్రార్ కృష్ణమోహన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వెంకటలక్ష్మి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌తో వైఎస్సార్‌సీపీ అనుబంధ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. వర్సిటీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆమె ప్రశంసించారు. ఇటీవల ఏయూ నిర్వహించిన ఉద్యోగ విజయోత్సవం కార్యక్రమం నూతన సంప్రదాయానికి నాంది పలికిందన్నారు.

ఎండాడలో సమ్మర్ క్యాంప్


విద్యార్థులతో జెడ్సీ కనకమహాలక్ష్మి

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ అథ్లెటిక్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను జోన్ – 2 జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి గురువారం సందర్శించారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ అందిస్తున్న పౌష్టికాహారాన్ని ఆమె పిల్లలకు అందజేశారు. వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తూ క్యాంప్ నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సంఘం చైర్‌పర్సన్ ఎన్.సీతామహాలక్ష్మి, సెక్రటరీ రాజేష్‌రెడ్డి, కోచ్ వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

అల్లిపురం: కుమారుడు మరణించాడని మనస్తాపానికి గురైన వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. దండుబజార్ ప్రాంతం ఎస్ఎస్ ప్లాజాలో గ్రంధి కృష్ణారావు తన కుటుంబంతో కలసి నివసిస్తున్నాడు. కొద్ది కాలం క్రితం అతని కుమారుడు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మనస్తాపంతో కృష్ణారావు భార్య పార్వతి అనారోగ్యం పాలైంది. కుమారుడి కోసం దిగులుగా ఉన్న ఆమె బుధవారం రాత్రి తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కృష్ణారావు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్ఐ పి.లక్ష్మి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమాచారమ్

ఉపాధి కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం : పిఠాపురం కాలనీలోని జన శిక్షణా సంస్థాన్‌లో పలు ఉపాధి కోర్సుల్లో శిక్షణకు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సంస్థ డైరెక్టర్ చౌక్కాల అప్పలనాయుడు తెలిపారు. స్వల్పకాలిక కోర్సులు పూర్తి చేసి ఉపాధి పొందవచ్చునని పేర్కొన్నారు. మూడు నెలల బ్యూటీషియన్, టైలరింగ్, ఆరు నెలల ప్రీస్కూల్ టీచర్ ట్రైనింగ్ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. 45 రోజుల పాటు కంప్యూటర్, డీటీపీ, ఎంఎస్ ఆఫీస్ కోర్సులకు వేర్వేరుగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. 30 రోజుల కోర్సు అయిన ఫొటోషాప్, 45 రోజుల పాటు టాలీ కోర్సులకు కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పిఠాపురం కాలనీలోని జన శిక్షణా సంస్థాన్ కార్యాలయంలో దరఖాస్తులను ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల్లోగా అందించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 85000 54456 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆరోగ్యంపై మహిళలకు అవగాహన


మహిళా ఉద్యోగులతో హెచ్‌పీసీఎల్ అధికారులు

ఏయూ క్యాంపస్: హెచ్‌పీసీఎల్ విశాఖ రిఫైనరీ ఆధ్వర్యంలో మహిళలకు ఆరోగ్యంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాల్తేరు పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళా సిబ్బందికి అవసరమైన వైద్య పరీక్షలు, చేసి, మందులు అందజేశారు. ఆజాదీకా అమృత్ మహోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల ఆరోగ్య సంరక్షణకు ఉపయోగపడే పోషకాహారం, తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై ఆహార నిపుణులు అవగాహన కల్పించారు. పలువురు మహిళలకు గైనిక్ పరీక్షలు జరిపి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీ శక్తి విశాఖ చాప్టర్ మహిళా సభ్యులు, కేంద్ర పెట్రోలియం ఇంధన శాఖ అధికారి అతుల్ గుప్తా, హెచ్‌పీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ జి.కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఐదుగురు గైర్హాజరు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన సప్లిమెంటరీ ఇంటర్మీడియట్ పరీక్షలకు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ నాగమణి తెలిపారు. ఉదయం జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 288 మంది హాజరు కావాల్సి ఉండగా.. నలుగురు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 8 మంది హాజరు కావాల్సి ఉండగా.. ఒక విద్యార్థి గైర్హాజరు కావడంతో ఏడుగురు పరీక్ష రాశారని ఆమె తెలిపారు.

ఆటో డ్రైవర్లపై జరిమానా తగదు

ఆరిలోవ: ఆటో డ్రైవర్లపై నిబంధనల పేరిట ఆర్టీవో అధికారులు భరించలేని జరిమానాలు విధిస్తున్నారని, ఇది తగదని ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ అన్నారు. ఆరిలోవ జోన్ సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఆటో కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ మూడు నెలల నుంచి ఆర్టీవో అధికారులు ఆటోలపై అక్రమ దాడులు చేస్తున్నారని ఆరోపించారు. రూ.5 వేలు నుంచి 25 వేలు వరకు జరిమానా విధిస్తున్నారని, వెంటనే ఈ దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆర్టీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలు ఆటో స్టాండ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు సత్తిబాబు, సూరిబాబు, రమణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ

ఎంటీ కృష్ణబాబుకు ఎన్ఎంయూఏ సత్కారం

మద్దిలపాలెం: రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శిగా పదోన్నతి పొందిన ఎం.టి.కృష్ణబాబును రాష్ట్ర ప్రజా రవాణ శాఖ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు సత్కరించారు. తాడేపల్లిలో గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఈహెచ్ఎస్ తదితర సమస్యలను కృష్ణబాబు దృష్టికి తీసుకెళ్లారు. పాత రిఫరల్ హాస్పటల్ ద్వారా వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజేష్‌కుమార్, విజయవాడ జోనల్ కార్యదర్శి రామారావు, ఎన్టీఆర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్ పాల్గొన్నారు.


ఎంటీ కృష్ణబాబును సత్కరిస్తున్న ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు

తలసేమియా రోగుల కోసం రక్తదానం



రక్తదానం చేస్తున్న యువతి

మద్దిలపాలెం : తలసేమియా, క్యాన్సర్ రోగుల కోసం యువతీ, యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. స్థానికంగా ఓ కళాశాలలో గురువారం మదర్స్ లవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫస్ట్ బ్లడ్ బ్యాంకు సారథ్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో నారాయణ విద్యా సమితికి చెందిన 20 మంది యువతీ, యువకులు రక్తదానం చేశారు.

అక్రమ కేసుల నమోదు దారుణం

సీతమ్మధార : కాంట్రాక్ట్ వర్కర్స్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ గంగారావు డిమాండ్ చేశారు. వెంకటరెడ్డిపై అసత్య ఆరోపణలు, అక్రమ బైండోవర్‌కు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గంగారాం మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు, క్లాప్ డ్రైవర్లు, పార్కులు, వెటర్నరీ, వాటర్ సప్లై తదితర విభాగల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పోరాడుతుంటే జీవీఎంసీ అధికారులు, పోలీసులు ఎన్నడూ లేని విధంగా అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలు, బైండోవర్ కేసులు పెట్టడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్,పి.వెంకటరెడ్డి, టి.నూకరాజు, యు.రాజు, ఎంవీ ప్రసాద్‌రావు, వి.కృష్ణారావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.


జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా చేస్తున్న కార్మికులు

సిరులతల్లికి సహస్ర తులసిపూజ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవా, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ.. కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.


సహస్ర తులసి పూజలో కనకమహాలక్ష్మి

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

సింహాచలం: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన ఘటన 97వ వార్డు పరిధి చినముషిడివాడలో గురువారం చోటుచేసుకుంది. చినముషిడివాలో ఉంటున్న కాళ్ల శ్రీనివాసరావు(38) తాపీమేస్త్రిగా పనిచేస్తున్నాడు. అతనికి భార్య ఇందిరాగౌరి, పిల్లలు మౌనీష, గౌతమి ఉన్నారు. చినముషిడివాడలోని శ్రమశక్తినగర్‌లో ఈటి సీతం నాయుడు ఇంటిలో మోటార్ పనిచేయకపోవడంతో సీతం నాయుడు శ్రీనివాసరావుకి ఫోన్ చేశాడు. ఉదయం 6 గంటల సమయంలో సీతం నాయుడు ఇంటికి శ్రీనివాసరావు వెళ్లాడు. మోటర్ స్విచ్ ఆన్ చేయగానే మోటర్‌ని పట్టుకుని ఉన్న శ్రీనివాసరావు విద్యుత్ షాక్‌కు గురై క్రింద పడిపోయాడు. వెంటనే 108కి ఫోన్ చేయడంతో అక్కడికి చేరుకున్న సిబ్బంది అప్పటికే శ్రీనివాసరావు మృతిచెందినట్టు తెలిపారు. దీంతో అక్కడికి చేరుకున్న పెందుర్తి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


శ్రీనివాసరావు(ఫైల్)

అందరి సహకారంతో బాల్య వివాహాల నియంత్రణ

ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

భీమునిపట్నం: బాల్య వివాహాల దురాచారం ఇంకా పలుచోట్ల ఉందని, దాన్ని నిర్మూలించడానికి అందరూ సహకరించాలని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు కోరారు. స్థానిక మహిళ, శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్), పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులతో బాల్య వివాహాల నిషేధ చట్టంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం అన్ని విషయాల్లో అభివృద్ధి చెందుతున్నా ఇంకా అనేక ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. తమకు ఫిర్యాదులు అందుతుండడంతో వివాహాలను అడ్డుకుంటున్నామని, కానీ పూర్తి స్థాయిలో ఆగడం లేదన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువగా జరుగుతుండడంతో అక్కడి ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. ఎంపీపీ దంతులూరి వాసురాజు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి ఎం.శ్రీదేవి, తహసీల్దార్ కె.వేణుగోపాల్, ఎంఈవో బాలామణి, ఎస్ఐ భరత్‌కుమార్, కమిషన్ సభ్యుడు గొండు సీతారాం పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

బాలల కోసం ప్రత్యేక చట్టాలు
బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని కేసలి అప్పారావు అన్నారు. ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్ ఆధ్వర్యంలో పేద వింతువుల పిల్లల అభ్యున్నతికి నిర్వహిస్తున్న కుటుంబ బలోపేత కార్యక్రమంలో భాగంగా తల్లులకు బాలల హక్కులపై అవగాహన కల్పించారు. చిల్డ్రన్స్ విలేజ్ డైరెక్టర్ కె.రవీంద్ర మాట్లాడుతూ వితంతువులు స్వయం ఉపాధి పొందడానికి, వారి పిల్లల చదువులకు సహకరిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా బాగా చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు అందించారు. కుటుంబ బలోపేత కార్యక్రమ ఇన్‌చార్జి కె.దుర్గరాజు, బాలల హక్కుల ఫోరం మండల కన్వీనర్ ఎల్లయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి


బీచ్ రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తున్న ఏసీపీ శివరామిరెడ్డి

కొమ్మాది: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అప్పుడే రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని ఏసీపీ శివరామిరెడ్డి సూచించారు. భీమిలి బీచ్ రోడ్డు జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట వద్ద గురువారం రాత్రి వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. ట్రిపుల్ రైడింగ్ చేసిన ఒకరిపై, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరిపై కేసు నమోదు చేశారు. లైసెన్స్, హెల్మెట్ లేని పది మందికి జరిమానా విధించారు. సీఐ లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


అప్పన్న ఉత్సవమూర్తులకు స్వర్ణపుష్పార్చన


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చన సేవ ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభాయమానంగా అలంకరించి కల్యాణమండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామ పూజ జరిపారు. విశేషంగా హారతులిచ్చారు. పూజలో పాల్గొన్న ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందించారు. ఆలయ ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ అప్పలనాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


వైభవంగా నిత్యకల్యాణం
శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంచేయజేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందించారు.

హృద్రోగులకు మెరుగైన సేవలు

కొమ్మాది: గీతం ఆస్పత్రిలో తాజాగా హృద్రోగులకు మెరుగైన సేవలు అందించడానికి అత్యాధునికంగా కేథ్ ల్యాబ్ (కేథరైజేషన్ ల్యాబొరేటరీ) ఏర్పాటు చేశారు. అన్ని రకాల గుండె జబ్బులకు చికిత్స అందించే విధంగా కోట్లాది రూపాయల వ్యయంతో గీతం అనుబంధంగా గల జిమ్సర్ ఆస్పత్రిలో ఈ సదుపాయాన్ని అపోలో ఆస్పత్రి కార్డియాలజీ విభాగం నిపుణులు డాక్టర్ బారువా, గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీ భరత్ ఆదివారం ప్రారంభించారు. గీతం బోధన ఆస్పత్రిలో పీజీ వైద్య విద్యను అభ్యసించే వారికి అత్యుత్తమ శిక్షణ ఇవ్వడంతోపాటు సామాన్యులు కూడా గుండె జబ్బుల చికిత్సకు ఇకపై దూర ప్రాంతాలకు వెళ్లనవసరం లేదని భరత్ అన్నారు. కార్యక్రమంలో గీతం వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టేందుకే ప్రైవేటీకరణ'

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలనే ఆలోచనతోనే ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చారని, ఉక్కు ఉత్పత్తిని నిలిపేసి, ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడమే కాక సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 833వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ప్రైవేటీకరణను ఆపాలని, సంస్థను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన తీరు మార్చుకుని స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.


833వ రోజు ఉక్కు దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు